# అక్రమ నిర్మాణాల కూల్చివేత

దుండిగల్, మార్చి 6: గాజులరామారం టౌన్ ప్లానింగ్ సిబ్బంది గురువారం సిద్ధి వినాయక నగర్ లోని పద్మజారెడ్డి, సింహాచలం అనే కాంట్రాక్టర్లు నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనాల్లోని అనుమతులు లేని



స్లాబులను, గోడలను కూల్చివేశారు. విషయం తెలిసిన నిర్మాణదారులతో పాటు స్థానికంగా ఉండే అధికార పార్టీకి చెందిన నేతలు అధికారుల విధులకు అడ్డుపడ్డారు. కాగా, చోటా మోటా నాయకుల ఒత్తిడితో నియోజకవర్గ స్థాయి నాయకుడు ఒకరు అధికారులకు ఫోన్ చేయడంతో అర్ధాంతరంగా టౌన్ ప్లానింగ్ సిబ్బంది వెనుతిరిగారు. అయితే అనుమతులకు మించి నిర్మించిన రెండు భవనాలను సీజ్ చేసినట్లు అధికారులు స్పష్టం చేశారు.

నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్ - మేడ్చల్
I హైదరాబాద్, శుక్రవారం 7 మార్చి 2025 HYDERABAD

# ఈ మహిళామణులు ఆదర్శవంతులు

కొందరు మహిళా ఉద్యోగులు సామాజిక సేవలో నిమగ్నమవుతున్నారు. నిరుపేద విద్యార్థులకు అండగా నిలుస్తున్నారు. అభాగ్య మహిళలకు ఉపాధినిచ్చి బాసటగా నిలుస్తున్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ మహిళా మణులపై ప్రత్యేక కథనం..

-సిటీబ్యూరో, మార్చి 6
(నమస్తే తెలంగాణ)



## అన్ని వసతులతో చదువుకునేలా..



ఆమె పేరు దుర్గ కల్యాణి. ఐటీ ఉద్యోగి. సర్కారు స్కూల్ పిల్లలు ప్రైవేట్ స్కూళ్ల మాదిరిగానే అన్ని వసతులతో చదువుకునేలా తమ వంతుగా సాయం అందిస్తూ పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలోని అమీన్‌పూర్-పటేల్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో 60 మంది విద్యార్థులకు లక్ష రూపాయల విలువజేసే 22 బెంచీలను అందించారు. బట్టలు, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. తమ జగతి ఫౌండేషన్‌ను సంప్రదిస్తే సేవలు అందిస్తామని ఆమె తెలిపారు.

## ఆకలితో ఎవరూ ఉండొద్దని..



ఆమె పేరు పావని. ఫార్మా కంపెనీలో ఉద్యోగం. తనకు వచ్చే జీతంలో 25 శాతం సహాయ కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నారు. 'ఆకలితో ఎవరైనా బాధపడితే నేను తట్టుకోలేను. సమాజ శ్రేయస్సు కోసం జరిగే ప్రతీ కార్యక్రమంలో నా పాత్ర ఉండాలని అనుకుంటా. ఆకలితో బాధపడే వారు రోడ్లపై కనిపిస్తే మా 8688577703 నంబర్‌కు ఫోన్ చేస్తే వారికి ఆహార పాకెట్లు అందిస్తా' అని అన్నారు.

## వీలైనంత సాయం..



ఆమె పేరు డాక్టర్ సాజిదాఖాన్, దేశంలోనే మొదటి మహిళా సౌండ్ ఇంజినీర్. ఎంత బిజీగా ఉన్నా ఆమె సామాజిక సేవ కోసం సమయం కేటాయిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు వెళుతూ బాలికల ఆరోగ్యం, అవసరాలు తెలుసుకుంటూ అండగా నిలుస్తున్నారు. ప్రతి నెల 150 మంది వితంతువులకు ఫయాజ్ చారిటెబుల్ ట్రస్ట్ ద్వారా వైద్య పరీక్షలు చేయిస్తున్నారు. సురక్ష మిషన్ ద్వారా బాలికల ఆశ్రమంలో వారికి అత్యవసర వస్తువులు పంపిణీ చేస్తున్నారు. 9059695714 నంబర్‌కు ఫోన్ చేస్తే మాకు వీలైనంత సాయం అందిస్తామన్నారు.

## సాధికారత కల్పిస్తూ..




ఆమె పేరు రీనా హిండొక. టచ్ ఏ లైఫ్ ఫౌండేషన్‌తో మురికివాడల్లో నివసించే బాలికల ఆరోగ్య, స్థితిగతులను తెలుసుకోవడం.. పోషకాహారం గురించి వారు ఎదుర్కొంటున్న సవాళ్లను, సమస్యలను అర్థం చేసుకొని బాసటగా నిలుస్తున్నారు. 'విరియా' (సరైన ప్రయత్నం) థీమ్‌తో అర్హులైన అమ్మాయిలకు ఉన్నత చదువుల కోసం స్కాలర్ షిప్ లను సైతం అందిస్తారు. ఎంపికైన ప్రతి అమ్మాయి పేరు మీద సేవింగ్స్ బ్యాంక్ ఖాతాను కూడా అందిస్తారు. ఆరోగ్య బీమా, ఇంటర్నెట్ కనెక్టివిటీతో కూడిన ల్యాప్ టాప్. విద్య, ఉద్యోగం, ఆరోగ్యం, ఆర్థిక, డిజిటల్ సమ్మిళితం వంటి అన్ని రంగాల్లో ప్రతి అమ్మాయికి సాధికారత కల్పిస్తున్నదీ ఫౌండేషన్.

# చెత్త తరలింపులో దుబారా..!

### వాహనాల డీజిల్, మరమ్మతుల పేరిట అక్రమాలు

### నకిలీ బిల్లులతో ఖజానాకు గండిపెడుతున్నా.. పట్టని అధికారులు




సిటీబ్యూరో, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ) : బల్దియాలో ఆర్థిక కష్టాల్లో కార్పొరేషన్ ఉందని చెబుతూనే మరో వైపు అనవసర ఖర్చులను పెంచి పోషిస్తున్నారు.ఆక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వచ్చిన వాటికి ఫుల్‌స్టాప్ పెట్టడం లేదు. చెత్త తరలింపునకు 268 మినీ టిప్పర్లు వినియోగిస్తుండగా..అందులో 150 పాతవి..వీటి నిర్వహణ డీజిల్, మరమ్మతుల పేరిట ఏటా రూ. కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు.అయితే చాలా వరకు 15 ఏండ్లు దాటిన టిప్పర్లు ఉన్నాయి.వీటిని స్క్రాప్‌కు పంపించి కొత్త వాహనాలను కొనుగోలు చేయాల్సిన అవసరం ఉంది.కానీ ఈ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ఫలితంగా సంస్థ ఖజానాకు నష్టం వాటిల్లుతున్నది. ఈ టిప్పర్ల వినియోగంలో డీజిల్ దోపిడీ ఒక్కటే కాదు..చాలా వరకు మరమ్మతుల పేరిట కొందరు అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పాత టైర్లు వేసి కొత్త టైర్లు వేసినట్లు బిల్లులు పెట్టడం...రిపేర్లలో వినియోగించే సామాన్లు సైతం అధిక మొత్తంలో బిల్లులు పెట్టి ఖజానాను గండి కొట్టడం లాంటి ఘటనలు లేకపోలేదు.

## అధికారుల వాహనాలు సైతం

కమిషనర్ నుంచి అడిషనల్ కమిషనర్లు, జోనల్ కమిషన్ల వరకు ఇన్నోవా వాహనాలను వినియోగిస్తుండగా...డిప్యూటీ కమిషనర్లు, కొందరు ఇంజనీర్లకు బొలొరో వాహనాన్ని వాడుతున్నారు..ఐతే బొలొరో వాహనాలు చాలా వరకు 15 ఏండ్లకు పైబడినే ఉన్నాయి. వీటి నిర్వహణలోనూ అక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

## పర్యవేక్షణ కరువు

జీహెచ్ఎంసీలో దాదాపు 38 స్వీపింగ్ మిషన్లు ఉండగా..వీటిలో 17 వాహనాలు బల్దియాకు చెందినవి కాలపరిమితి ముగియడంతో పక్కన పడేశారు. ప్రస్తుతం సుమారు 18 వెహికల్స్ అద్దె ప్రాదిపదికన కొనసాగుతున్నాయి. అద్దె ప్రాతిపదికన ఏజెన్సీలకు ఒక్కో వాహనానికి ఏడాదికి రూ. కోటి 13 లక్షలకు పైగా చెల్లిస్తున్నారు. ప్రతి ఏటా వీటి కోసం రూ.20కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారు. ఈ స్వీపింగ్ యంత్రాలతో ఒక్కో మిషిన్ 40 కిలోమీటర్ల నుంచి 60 కిలోమీటర్ల వరకు క్లీన్ చేయాలి. కానీ కొన్ని ఏజెన్సీలు సగం కిలోమీటర్లు కూడా చేయకుండా బిల్లులు క్లెయిమ్ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వీటితో పాటు నగరంలోని వీఐపీలు ఉండే ప్రాంతాల్లోనే తప్ప కమర్షియల్ కారిడార్లు, ప్రధాన రహదారులపై మాత్రం కనిపించడం లేదని కార్మిక సంఘాల నేతలు వాపోతున్నారు. అన్నింటి కంటే ముఖ్యంగా జీహెచ్ఎంసీకి సంబంధించి రెండు స్వీపింగ్ మెషిన్లు హెచ్‌జీసీఎల్ (హెచ్ఎండీఏ ఔటర్ విభాగం)కు అప్పగించగా..తిరిగి హెచ్‌జీసీఎల్ నుంచి జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి జోన్‌కు వచ్చిన వాటిని పూర్తిగా పక్కకు పెట్టడం అధికారుల పనితీరుకు గమనార్హం.

# వెలగని గృహజ్యోతి.. అందని గృహలక్ష్మి

### సిటీలో పూర్తిస్థాయిలో అమలు కాని 'కాంగ్రెస్' పథకాలు

సిటీబ్యూరో: కాంగ్రెస్ సర్కార్ అమలు చేస్తున్న గృహజ్యోతి, గృహలక్ష్మి పథకాలు క్షేత్రస్థాయిలో పూర్తిగా అమలు కావడంలేదు. రాష్ట్రంలోని అర్హులందరికీ 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేస్తున్నామని చెప్పుకుంటున్న ప్రభుత్వం కొంతమందికి మాత్రం మొండి చెయ్యి చూపిస్తున్నది. గృహజ్యోతి పేరిట గ్యాస్ సిలిండర్‌ను రూ.500కే అందజేస్తున్నామని చెబుతున్నా... ఇప్పటికీ కొంతమందికి పూర్తి అర్హతలున్నా పథకం వర్తించడంలేదు. ఇందుకు నిత్యం హైదరాబాద్ కలెక్టరేట్‌కు దరఖాస్తులతో వస్తున్న అర్హులే నిదర్శనం. గృహలక్ష్మి, గృహజ్యోతి పథకాలకు అర్హుల నుంచి కలెక్టరేట్‌లో దరఖాస్తులు తీసుకునేందుకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో అర్జీలు స్వీకరిస్తున్నారు. తాము ఆ రెండు పథకాలకు అన్ని విధాల అర్హులమైనా ఎందుకు వర్తింపజేయడంలేదని దరఖాస్తుదారులు ప్రశ్నిస్తే అధికారుల నుంచి సమాధానం రావడంలేదని చెబుతున్నారు.

## కష్టాలు మొదలయ్యాయి

పదేండ్ల కేసీఆర్ పాలనలో ఇలా అధికారుల చుట్టూ ఎన్నడూ తిరగలేదు. కాంగ్రెస్ వచ్చింది మాకు కష్టాలు వచ్చాయి. హైదరాబాద్‌లోని బస్తీల ప్రజలు కాంగ్రెస్ సర్కారు తీరుతో అవస్థలు పడుతున్నారు. కాగితాలు, జిరాక్స్ పేపర్లు పట్టుకుని అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగలేక అవస్థలు పడుతున్నాం.

- గృహజ్యోతి దరఖాస్తుదారులు



గృహజ్యోతి, గృహలక్ష్మి పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన అర్హులు

# నిధులివ్వరా..? నేరాల కట్టడి ఎట్లా?

- స్టేషనరీ నుంచి డీజిల్ వరకు అన్ని ఖర్చులూ పోలీసులవే
- ఒక్క రూపాయీ విడుదల చేయని ప్రభుత్వం
- స్టేషన్‌కు వచ్చేవారిపై ఆధారపడే పరిస్థితి
- బీఆర్ఎస్ హయాంలో పీఎస్‌ల నిర్వహణ భేష్




సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్ పోలీస్ స్టేషన్ల నిర్వహణ ఖర్చును ప్రభుత్వమే భరించాల్సి ఉండగా కొన్నినెలలుగా ఒక్క పైసా విడుదల చేయడం లేదు. దీంతో స్టేషన్‌లో చిన్న గుండుసూది మొదలు.. డీజిల్ వరకు సొంతంగా భరించాల్సి రావడంతో పోలీసులు అయోమయంలో పడిపోతున్నారు. ఒకవైపు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల వద్ద ఒక్కరూపాయి కూడా తీసుకోవద్దని చెబుతున్న ప్రభుత్వం స్టేషన్ నిర్వహణ కోసం మెయింటెనెన్స్ నిధులు మాత్రం ఇవ్వడం లేదు. గత పదేళ్లలో ఎప్పుడూ లేని దుస్థితి ఇప్పుడు వచ్చిందని పోలీసులే బహిరంగంగా విమర్శిస్తున్నారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు పోలీస్‌స్టేషన్ల నిర్వహణకు ప్రభుత్వాలు ఎలాంటి నిధులు ఇచ్చేవి కావు. దీంతో పోలీసులు ఎంతో కొంత ఫిర్యాదు దారుల నుంచి వసూలు చేయాల్సి వచ్చేది. ఈ దుస్థితి ఉండొద్దని తెలంగాణ వచ్చిన తర్వాత ఏర్పాటైన కేసీఆర్ సర్కార్ ప్రతీ పోలీస్‌స్టేషన్‌కు స్థాయిలను బట్టి మెయింటెనెన్స్ కింద నిధులు కేటాయించింది. దీంతో పీఎస్ ఖర్చుల కోసం ఫిర్యాదుదారులను పీడించడం తగ్గిపోయింది. కానీ మళ్లీ పోలీసుల అవస్థలు , ఫిర్యాదుదారుల నుంచి డబ్బులు తీసుకోవడాలు ఈ ప్రభుత్వం వచ్చాక మొదలయ్యాయి.

## తమ జేబుల నుంచే పెట్టుకోవాలి..!



హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 71 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. ప్రతీ పోలీస్ స్టేషన్‌కు నెలవారీ నిర్వహణ ఖర్చుల నిమిత్తం రూ.75 వేలు ప్రభుత్వం విడుదల చేయాలి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పీఎస్‌ల మెయింటెనెన్స్ ఖర్చుల విషయంలో ఎప్పుడూ వెనకాడలేదు. నిధులు ఎప్పటికప్పుడు విడుదల చేయడం వల్ల పోలీసులు తమ స్టేషన్ల నిర్వహణ కోసం వేరేవారిపై ఆధారపడకుండా ఉండేవారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. ప్రధానంగా నగరంలోని కమర్షియల్ డివిజన్ పరిధిలో ఉన్న రెండు పోలీస్ స్టేషన్‌లలో వీఐపీల రద్దీ కొనసాగుతుంది. ఇక్కడికి వచ్చే ఫిర్యాదుదారుల కంటే వీఐపీలు, ఉన్నతాధికారులే ఎక్కువగా వస్తుండటంతో మెయింటెనెన్స్ తడిసి మోపడవుతున్నది. అసలే మెయింటెనెన్స్ రాక తలలుపట్టుకుంటుంటే వచ్చే వారికి మర్యాదలు చేయాల్సి రావడం.. ఒకవేళ వారిని పట్టించుకోకపోతే తమపై అధికారులు ఎలా స్పందిస్తారో తెలియక స్టేషన్ ఆఫీసర్లు ఆందోళన చెందుతున్నారు. తమ జేబుల నుంచి ఈ మెయింటెనెన్స్ పెట్టుకోవాల్సిన పరిస్థితి వస్తున్నదని చెబుతున్నారు.

## స్టేషనరీ మొదలు డీజిల్ వరకు..!

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతీనెలా పోలీస్ స్టేషన్లకు మెయింటెనెన్స్ రాక పోలీసులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. డీజిల్ కోసం పెట్రోల్ బంక్‌లకు వెళ్లి ఖాతా పెడుతున్నారు. అయితే ఈ మెయింటెనెన్స్ కూడా స్టేషన్‌కు వచ్చే వారి దగ్గరి నుంచో లేక ఎవరైనా లీడర్లు పీఎస్ నిర్వహణకు ఉంచుకోండంటూ ఇస్తేనో పెట్టుకోవలసి వస్తోంది తప్ప ప్రభుత్వం నుంచి పైసా రావడం లేదని.. తాము దర్యాప్తు జరపాలంటే కూడా కష్టమే అవుతోందని పోలీసులు వాపోతున్నారు. పెండింగ్ కేసులు పెరుగుతున్నాయంటూ ఉన్నతాధికారుల నుంచి ఒత్తిళ్లు.. నిందితులను పట్టుకోలేరంటూ చీవాట్లు.. వీటన్నిటికీ కారణం ఒక్కటే డబ్బులు లేకపోవడం. తాము నిందితుల కోసం గాలించే సమయంలో డబ్బులు ఇస్తాం.. మీరు పెట్టుకోండంటూ చెప్పి ఆ తర్వాత ఇవ్వకపోవడంతో దర్యాప్తు ప్రక్రియ మధ్యలోనే ఆగిపోతుందని ఒక పోలీస్ అధికారి చెప్పారు. తమను డబ్బులు తీసుకోవద్దంటూనే ఇంత ఖర్చు ఎలా భరించాలో ప్రభుత్వమే చెప్పాలంటూ ప్రశ్నించారు.



భూమి పూజ చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

## ఫోర్త్ సిటీలో స్థానికులకే ఉద్యోగాలు:మంత్రి శ్రీధర్‌బాబు

బడంపేట్:ఫోర్త్ సిటీతో పాటు మహేశ్వరం నియోజకవర్గంలో వచ్చే ప్రతీ పరిశ్రమలో స్థానికులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా కల్పిస్తామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలో ని రావిర్యాలలో డీసీపీ కార్యాలయం, లెన్స్ కార్ట్ పరిశ్రమ నిర్మాణానికి గురువారం ఆయన భూమి పూజ చేశారు. లెన్స్ కార్ట్ పరిశ్రమ ఏర్పాటుకు 52 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించిందన్నారు.రూ.1500 కోట్ల పెట్టుబడితో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మించే ఈ పరిశ్రమలో 1500 మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, రాచకొండ సీపీ సురేంద్రబాబు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# మోతమోగుతున్న ఎల్ఆర్ఎస్ టోల్ ఫ్రీ నంబర్

### అస్పష్టమైన విధానాలతో దరఖాస్తుదారులకు తప్పని ఇబ్బందులు

సిటీబ్యూరో: 'మియాపూర్‌లో నివాసం ఉండే రఘుబాబు ఐదేళ్ల కిందట పటాన్‌చెరూ సమీపంలో 242 గజాల విస్తీర్ణంలో ఉండే ప్లాట్‌ను కొనుగోలు చేశారు. అవగాహన రాహిత్యంతో ఎల్ఆర్ఎస్ సమయంలో వ్యక్తిగతంగా దరఖాస్తు చేయలేదు. తాజాగా దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించినా ఏ అధికారిని కలవాలో తెలియక... హెచ్ఎండీఏ టోల్ ఫ్రీ నంబర్‌ను ఆశ్రయించే ప్రయత్నం చేశారు. అయితే ఉదయం నుంచి టోల్ ఫ్రీ నంబర్‌కు ప్రయత్నిస్తున్నా.. ఒక్కసారి కూడా కలిసే అవకాశం రాలేదని వాపోయాడు.' లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీంతో ఇలా ఇబ్బందులు పడుతున్న వారెందరో.. ఇప్పటికే అస్పష్టమైన విధానాలు, పాలనపరమైన సందేహాలతో ఆ ప్రక్రియనే గందరగోళంగా మారిన నేపథ్యంలో... దరఖాస్తుదారుల సందేహాలను నివృత్తి చేసే వేదిక లేక తలలు పట్టుకుంటున్నారు. మార్చి 31లోపే 25శాతం రాయితీతో ఎల్ఆర్ఎస్ చెల్లించే వెసులుబాటు కల్పించినా ప్రభుత్వం... అందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లపై దృష్టి పెట్టలేకపోయింది. హెచ్ఎండీఏ పరిధిలో దాదాపు 8లక్షలకు పైగా ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. కాగా, దరఖాస్తుదారులకు మెరుగైన సేవలు అందించేందుకు 1800599838 ఎల్ఆర్ఎస్ టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. రెండు రోజుల వ్యవధిలోనే దాదాపు 500కు పైగా కాల్స్ రావడంతో సిబ్బంది కూడా చేతులెత్తివేసేలా పరిస్థితి మారింది.కాగా రాష్ట్రంలో 25.60 లక్షల మంది ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తులు చేసుకుంటే వారిలో ఇప్పటి వరకు కేవలం 15000 మంది మాత్రమే ఫీజులు చెల్లించినట్లు సంబంధిత అధికార వర్గాల వారు ధ్రువీకరిస్తున్నారు.



మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
PRESENT




లక్షల మందిని చేరుకునే సలక్షణ వేదిక

అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న నిజామాబాద్ మరియు పరిసర ప్రాంతాల్లోని అన్ని ప్రముఖ సంస్థల ప్రాపర్టీలు, హైదరాబాద్‌లోని ప్రఖ్యాత రియాల్టీ ప్రాపర్టీలు ఒకే వేదికపైన మరియు తక్షణ రుణ సదుపాయం కొరకు ప్రముఖ జాతీయ బ్యాంకులు కూడా అదే వేదికపై అందుబాటులో ఉంటాయి.

08 - 09, మార్చి 2025
వేదిక: వేణు మాల్ (హోటల్ నిఖిల్ సాయి)
దేవి థియేటర్ క్రాస్ రోడ్డు, హైదరాబాద్ రోడ్డు, నిజామాబాద్

Digital Sponcer
TV Sponcer

Main Sponsor: VASAVI GROUP You dream. We deliver.
Associate Sponsors: SVC, MAKUTA
In Association With: SRI ASHOKA BUILDERS & DEVELOPERS, AISHWARYAM HOMES, ROYALOAK NIZAMABAD, APD DEVELOPERS, BALAJI DIVINE, SBI, Sri Govinda Sai Builders & Developers, SHRI SLN PROPERTIES, ANKURAM, MYRA SUPERIOR LIVING, KAPIL PROPERTIES, ADURI GROUP, BHOOMI SPACE, TMR GROUP, NORTH CREST, SUNYUGA INFRA PVT. LTD., AKSHAYA ENTERPRISES

Booking Enquiry: Nizamabad - 9182777399, 9182777590